ఆ భూములు మావే..

భూముల పరిశీలనకు వెళ్లిన ఆర్డీవోను అడ్డుకున్న గిరిజనులు

రెవెన్యూ అధికారులను అడ్డుకుంటున్న షెల్మజాలతండా గిరిజనులు

పరిగి, ఫిబ్రవరి 10 : పరిగి మండలం రంగంపల్లి రెవెన్యూ గ్రామం పరిధిలోని సర్వే నం. 51, 62లలో గల భూములను పరిశీలించేందుకు వెళ్లిన వికారాబాద్ ఆర్డీవో విజయకుమారి, తహసీల్దార్ ఆనంద్‌రావులను షెల్మజాలతండా గిరిజనులు అడ్డుకున్నారు. సర్వే నం.51లో 6.11 ఎకరాలు, సర్వే నం.62లో 4 ఎకరాలు అబ్దుల్ వదూద్ పేరిట భూమి ఉందని, పట్టాగా మార్చాలని హైకోర్టులో కేసు కొనసాగుతున్నది. కలెక్టర్ నిర్వహిస్తున్న స్పెషల్ ట్రిబ్యునల్‌లో శనివారం కేసు వాదనలు ఉండగా ఈ భూములను పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించడంతో శుక్రవారం సాయంత్రం వికారాబాద్ ఆర్డీవో విజయకుమారి, తహసీల్దార్ ఆనంద్‌రావు, అధికారులు మొదట షెల్మజాలతండా సమీపంలోని సర్వే నం.62 ని భూములను, అనంతరం సర్వే నం.51లోని భూములను పరిశీలించి వస్తున్నారు. ఈ రాత్రి సమయంలో భూమి పరిశీలన ఎలా చేస్తారని, తమ భూములు పరిశీలిస్తున్నప్పుడు తమకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని తండా గిరిజన రైతులు అధికారులను నిలదీశారు. సుమారు గంటపాటు అధికారులను గిరిజనులు అడ్డుకున్నారు. సర్వే నం.62లో తమ తాతల కాలం నుంచి 30 ఎకరాల భూమి తమ పేరిట పట్టాలున్నాయని, రైతు బంధు వస్తున్నదని పేర్కొన్నారు.

తాతల కాలం నుంచి అవి మా భూములే..

మా తాతల కాలం నుంచి సర్వే నం.62లో 30 ఎకరాల భూమి 11 మంది పేరిట పట్టా ఉన్నది. ఆనాటి నుంచి భూమి సాగు చేసుకుంటున్నాం. రైతు బంధు వస్తున్నది. పాత పాసు పుస్తకాలతోపాటు కొత పాసు పుస్తకాలు కూడా వచ్చాయి. భూమి చూసేందుకు రెవెన్యూ అధికారులు రాత్రి సమయంలో రావడం ఏమిటి? మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం. మేము సాగు చేసుకుంటున్న భూములు మావే..

- చంద్ర్యానాయక్, షెల్మజాలతండా

డ్రగ్స్ ఫ్రీ సిటీగా మార్చుదాం

కళాశాలల్లో కొత్త మార్గదర్శకాలు తీసుకొస్తాం

మత్తు పదార్థాలు విక్రయించే వారిపై పీడీయాక్ట్

బిట్స్ పిలానీలో జరిగిన సదస్సులో టీఎస్ నాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, సీపీలు సుధీర్‌బాబు, అవినాష్ మహంతి

జవహర్‌నగర్, ఫిబ్రవరి 10 : మనిషి జీవితం దారంలాంటిదని, దారం తెగితే అతుకులే మిగులుతాయని టీఎస్ నాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, సైబరాబాద్ సీసీ మహంతి అన్నారు. హైదరాబాద్‌ను డ్రగ్స్ ఫ్రీ సిటీగా మారుద్దామని పిలుపునిచ్చారు. బిట్స్ పిలానీ క్యాంపస్‌లో యాంటీ డ్రగ్స్‌పై రాచకొండ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై ప్రసంగించారు. యువత మత్తుకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, విద్యార్థులు మంచి భవిష్యత్తును ఎంచుకొని ముందుకు సాగాలని సూచించారు. మత్తు పదార్థాలు విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఇప్పటికే 12మందిపై పీడీయాక్ట్ కేసులు నమోదు చేసి రూ.5కోట్ల విలువైన మాదకద్రవ్యాలను పట్టుకున్నామని చెప్పారు. కళాశాలలో మాదక ద్రవ్యాల నిరోధకంపై కొత్త మార్గదర్శకాలు తీసుకొస్తామని తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూఎస్ కాన్సులెట్ అధికారి ఎర్న్‌ఫిషర్, సీఐలు సీతారాం, రాములు, డీఐ శ్రీనివాస్, ఎస్సైలు అనిల్‌యాదవ్, అనిల్‌కుమార్, వేణు, పోలీసులున్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎస్ నాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, సీపీలు సుధీర్‌బాబు, అవినాష్ మహంతి అవగాహన సదస్సుకు హాజరైన కళాశాల విద్యార్థులు

ఓఆర్‌ఆర్ రోడ్డు సమీపంలో అనుమతులు లేని క్రషర్లను కూల్చేస్తున్న మైనింగ్ అధికారులు

'అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటాం'

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10 : జిల్లాలో అక్రమంగా మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ అధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. అనుమతులేని ఎనిమిది క్రషర్లను పొల్యూషన్ అధికారులతో కలిసి శనివారం కూల్చివేసినట్లు ఆయన తెలిపారు. ఔటర్‌రింగ్ రోడ్డు సమీపంలోని వట్టినాగులపల్లి, బోపన్‌పల్లి, కోకాపేట్‌లల్లో వీటిని కూల్చివేశామన్నారు. అనుమతులు లేకుండా రాత్రి సమయంలో మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. త్వరలో స్పెషల్ టీంలను ఏర్పాటు చేసి విస్తృతంగా దాడులు చేస్తామని తెలిపారు.

అక్రమ సంపాదనే లక్ష్యంగా..

- **ఫోర్జరీ సంతకాలతో రియల్ వ్యాపారుల ఆగడాలు**
- **అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు**
- **వివరాలను వెల్లడించిన శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి**

షాద్‌నగర్, ఫిబ్రవరి 10 : అక్రమ సంపాదనే లక్ష్యంగా ఫోర్జరీ సంతకాలకు పాల్పడి ప్లాట్లను విక్రయించిన రియల్ వ్యాపారిని షాద్‌నగర్ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. షాద్‌నగర్‌లోని ఏసీపీ కార్యాలయంలో శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో మేరీ సువర్ణభూమి పేరుతో వెంచర్‌ను నిర్మించారు. హైదరాబాద్‌కు చెందిన మంచాల సాయి సుధాకర్ సంస్థ డైరెక్టర్‌గా ఉన్నారు. అక్రమంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో హైదరాబాద్‌కు చెందిన కల్యాణ్‌చక్రవర్తి, సల్లా యాదవ్, ఎన్.పల్లయ్యగుప్తాలతో కలిసి డెవలప్‌మెంట్ వెంచర్‌లో ఉన్న ప్లాట్లను ఫోర్జరీ సంతకాలతో విక్రయించాడు. ఈ విషయమై మేరీ సువర్ణభూమి సంస్థ ఎండీ కె.కావ్య కొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన వి.కృష్ణమోహన్ అనే మరో నిందితుడు సైతం ఫోర్జరీ సంతకాలతో ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఈ సంఘటనపై షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టు ప్రకారం దొంగ సంతకాలతో ప్లాట్లను విక్రయించినట్లు తెలుపడంతో ఎం.సాయి సుధాకర్, కల్యాణ్‌చక్రవర్తిలపై చట్ట ప్రకారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని వివరించారు. గతంలో కూడా ఇద్దరిపై బంజారాహిల్స్, సైబరాబాద్ క్రైమ్ పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయని చెప్పారు. అక్రమ సంపాదనే లక్ష్యంగా దుర్బుద్ధితో సంతకాలను ఫోర్జరీ చేసి విలువైన సంపదను కొల్లగొట్టడంతో పాటు మోసానికి పాల్పడ్డారని తెలిపారు. ఈ తరహా నేరాలు బాధాకరమని పేర్కొన్నారు. గతంలోనే మొదటి ముద్దాయి మంచాల సాయి సుధాకర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపగా, శనివారం రెండో ముద్దాయి కల్యాణ్ చక్రవర్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఏసీపీ రంగస్వామి, షాద్‌నగర్ సీఐ ప్రతాపలింగం, సిబ్బంది పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న డీసీపీ నారాయణరెడ్డి

మానవ జీవన విధానాన్ని పర్యావరణహితంగా మార్చుకోవాలి

తుర్కయాంజాల్, ఫిబ్రవరి 10 : పర్యావరణ హితంగా మానవ జీవన విధానాన్ని అలవర్చుకోవాలని అబ్దుల్లాపూర్‌మెట్ ఎంఈవో వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడలోని వశిష్ఠ మోడల్ స్కూల్‌లో తెలంగాణ రాష్ట్ర జాతీయ హరితదళం విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లా స్థాయిలో నాటికలు, ఏకపాత్రాభియం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 21 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని ప్లాస్టిక్ వాడకాన్ని మానేయాలని ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకాన్ని మానేయడం ద్వారా సమాజానికి ఎంతో మేలు చేసినవారవుతారన్నారు. కార్యక్రమంలో హరితదళ సమన్వయకర్త, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌రావు, వశిష్ఠ స్కూల్ కరస్పాండెంట్ మునీందర్‌రావు, ప్రిన్సిపాల్ మమత పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్న విద్యార్థులు

జంతువుల దాహం తీర్చని సాసర్‌పిట్స్

నీళ్లు లేక నిరుపయోగంగా ఉన్న సాసర్‌పిట్

వికారాబాద్, ఫిబ్రవరి 10 : అనంతగిరి అటవీలో జంతువుల కోసం గతంలో 7, 8 సాసర్‌పిట్స్‌లను ఏర్పాటు చేశారు. వాటిలో అటవీ శాఖ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని పట్టడంతో అటవీ జంతువులు, పక్షులు దాహం తీర్చుకునేవి. కాని కొన్ని రోజుల నుంచి కొన్ని సాసర్‌పిట్స్‌లలో నీరు లేక వృథాగా పడి ఉన్నాయి. మరికొన్ని సాసర్‌పిట్స్‌లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వాటికి మరమ్మతులు చేసి జంతువుల దాహాన్ని తీర్చాలని పలువురు కోరారు. ఈ విషయమై సంబంధిత అధికారిని వివరణ కోరగా.. బీట్ ఆఫీసర్‌తో చర్చించారు. రెండు మూడు రోజులకోసారి బీట్ ఆఫీసర్ ద్వారా సాసర్ పిట్స్‌లలో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారన్నారు. అక్కడక్కడా కొన్ని సాసర్‌పిట్స్‌లు మరమ్మతులకు వచ్చాయి. వాటిని రిపేర్ చేసి మళ్లీ నీటితో నింపుతామన్నారు. అటవీ ప్రాంతంలో ఒక చెక్ డ్యాంక్‌లో నీరున్నదని ఆయన వివరించారు.

లాభసాటిగా.. పాడి పరిశ్రమ

పాడి వైపు మొగ్గు చూపుతున్న గ్రామీణ యువత

- **వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు**
- **సబ్సిడీపై యంత్ర పరికరాలను అందజేస్తున్న సర్కారు**
- **సరైన పద్ధతులు పాటిస్తే అతి తక్కువ శ్రమతో అధిక లాభాలు**
- **ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకోవాలంటున్న అధికారులు**

పాల ఉత్పత్తులు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో నేడు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా పాడి పశువులను పెంచుతున్నారు. తమ ఇంటి అవసరాలకు సరిపడా పాలను సమకూర్చుకుంటూ మిగతా విక్రయించి ఉపాధి పొందుతున్నారు. అతి తక్కువ శ్రమతో అధిక లాభాలు గడిస్తున్నారు. నేడు గ్రామీణ యువత పెద్దఎత్తున పాడి పరిశ్రమవైపు మొగ్గు చూపుతూ.. ఎక్కడ చూసినా ఆవులు, గేదెలను పెంచుకుంటూ పాలను విక్రయించి ఉపాధి పొందుతున్నారు. ఒకప్పుడు 20 నుంచి 30 పశువులతో నిండుగా కనిపించిన పశువుల కొట్టాలు, చావిళ్లు నేడు ఖాళీగా శిథిలావస్థలో కనిపిస్తున్నాయి. అనేక కారణాల వల్ల కూలీల లభ్యత తగ్గి, పాడి పశువుల నిర్వహణ, నమ్మకమైన పనివాళ్ల కొరతను పాల ఉత్పత్తి రంగం ఎదుర్కొంటూ వస్తున్నది. కాని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం వ్యవసాయ రంగంతోపాటు పాడి పరిశ్రమలో సమూల మార్పులు తీసుకువస్తున్నది. రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎక్కువగా అలిసిపోకుండా ప్రత్యేక యంత్ర పరికరాల సహాయంతో శ్రమను తగ్గించేందుకు ప్రత్యేకంగా కృషిచేస్తున్నది. రైతులు ముఖ్యంగా పాడి పరిశ్రమలో శ్రమను తగ్గించేందుకు తీసుకోవాల్సిన నూతన విధానంపై ప్రత్యేక కథనం.

- ఇబ్రహీంపట్నంరూరల్

యంత్రం సహాయంతో గడ్డిని చిన్న ముక్కలుగా కత్తిరిస్తున్న రైతులు

గడ్డికోత మిషన్లు

పశుగ్రాసాల వృథాను తగ్గించి, పశువులు వాటిని సులువుగా జీర్ణం చేసుకుని ఎక్కువ ప్రయోజనం పొందుటకు విద్యుత్‌తో నడిచే గడ్డికోత మిషన్లను ఏర్పాటు చేసుకుంటే మంచిది. బోరు బావి నుంచి నీటిని తోడటానికి ఏర్పర్చుకున్న మోటారుకే మరొక అదనపు కనెక్షన్‌ను ఏర్పాటు చేసి, దానితో గడ్డికోత మిషన్‌ను కూడా నడపగలిగితేనే ఒకే సమయంలో తక్కువ శ్రమ, తక్కువ విద్యుత్ వినియోగంతో రెండు పనులు పూర్తవుతాయి.

పశువుల ఆవరణ ఏర్పాటు

పరిమితంగా అత్యవసరంలో మాత్రమే పశువులు తలదాచుకునేలా చిన్న పాకలు, షెడ్ల తోపాటు అనుబంధంగా కొంత విశాలమైన ఆవరణలో చెట్ల నీడను ఏర్పాటు చేయగలిగితే ఈ నీడలో పశువులు స్వేచ్ఛగా తిరుగుతూ ఆరోగ్యంగా ఉంటాయి. ఇందువల్ల పాకలను శుభ్రపరిచే అవసరం మూడు లేదా నాలుగో వంతుకు తగ్గుతుంది. ఈ ఆవరణలో ఒక మూల తాగునీరు, మరో మూల మేతను ఏర్పాటు చేస్తే వాటికి తగినంత నడక, వ్యాయామం కూడా ఉంటుంది. పాకలు, షెడ్లకే పరిమితమైన పశువుల్లో కంటే ఇలాంటి ఆవరణల్లో దూరం, దూరంగా స్వేచ్ఛగా సంచరించే పశువుల్లో పొదుగు వాపు వంటి వ్యాధులు, ఇతర పరాన్నజీవులు వృద్ధి చెందే అవకాశాలు కూడా తక్కువ. ఈ ఆవరణలో మామిడి, మునగ, నేరేడు, వేప, సుబాబుల్ వంటి చెట్లను పెంచి పశువులకు చల్లని నీడతో పాటు విపత్తు సమయాల్లో ప్రత్యామ్నాయ మేతలు కూడా ముఖ్యంగా దూడలకు లభ్యమౌతాయి. ఈ రోజుల్లో పశువులను బయటకు మేత కోసం తీసుకెళ్లేవారు ఉండటం లేదు. ఉన్నా బయట వాటికి ప్రయోజనం అంతగా ఉండటంలేదు. కావున, ఈ ఏర్పాటు చేసుకుంటే ఎంతో బాగుంటుందని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు.

పాకలు, పశువుల పరిశుభ్రత

చీపుళ్లు, తట్టలు, చేతులు వాడకుండా పశువుల వ్యర్థాలను పొడవైన కర్రలతో బిగించిన రబ్బరు దంతెలు, పారలతో ట్రాలీల్లోకి ఎత్తి సులువుగా దూరంగా తొలగించుకునే ఏర్పాటు చేసుకోవాలి. పాకలను, పశువులను కడగడానికి మోటారుకు రబ్బరు పైపును బిగించిన నాజిల్ ద్వారా వచ్చే నీటితో అత్యంత వేగంగా, సులువుగా శుభ్రపర్చుకోవచ్చును. పాత పద్ధతిలో ఒక పశువును కడిగే సమయంలో సులువుగా 5 నుంచి 6 పశువులను ఈ పద్ధతిలో శుభ్రపర్చుకోవచ్చును. వేసవితాపం సమయంలో ఈ పైపులతో సులువుగా పశువులన్నింటినీ క్షణాల్లో చల్లని నీటితో తడపవచ్చును.

తాగునీటి సరఫరా ఏర్పాట్లు

ఎత్తులో నిర్మించిన వాటర్ ట్యాంకులో కనీసం 3-4 రోజుల అవసరాలకు సరిపోయే నీటిని నిల్వ చేసుకుని పైపుల ద్వారా పశువులకు అందుబాటులో సరఫరా చేసే ఏర్పాటు వల్ల నీటి సరఫరా శ్రమ చాలా వరకు తగ్గుతుంది. ఒక బేసిన్‌పైన అమర్చిన కుళాయిని పశువు తన ముట్టెను ఆనిస్తే తాగడానికి వీలుగా సరఫరా అయ్యే పాత్రలు నేడు చాలా చోట్ల అందుబాటులో ఉన్నాయి. వీటిని పశువుల పాకలో గోడలకు, మేత తొట్లకు, స్తంభాలకు బిగించుకోవచ్చును. ఇందువల్ల పశువులకు పరిశుభ్రమైన తాగునీరు అన్ని వేళలా అందుబాటులో ఉంటుంది.

గేదెల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన షెడ్డు

పశువుల పాకల నిర్మాణం

యజమాని ఇంటికి దగ్గరగానే కాకుండా ఇంట్లో రోజువారీ గృహ కార్యక్రమాలను నిర్వహిస్తున్న కుటుంబసభ్యుల దృష్టిలో పశువులన్నీ ఉండేలా, మంచి గాలి, వెలుతురుతో పాటు, సులువుగా, శుభ్రంగా ఉండేలా పాకలు పరిసరాల కంటే కనీసం 1 1/2-2 అడుగుల ఎత్తుగా నిర్మించుకోవాలి. కొంత ఖర్చు ఎక్కువైనప్పటికీ సిమెంట్ కాంక్రీటుతో పటిష్టంగా ఏర్పర్చుకోవాలి. రెండు అడుగుల వెడల్పు మేత తొట్టి, పశువు పొడుగుకు అనువైన 5-6 అడుగుల పొడవైన 4-5 అడుగుల వెడల్పు నేల, తోక వైపు 1/2-1 అడుగుల వెడల్పు చిన్న కాలువను నిర్మించాలి. ముందు నుంచి వెనుకకు ఆరంగుళాల వాలుతో పశువుల మలమూత్రాలు నేరుగా కాల్వలో పడేలా నిర్మించుకుంటే పశువుల పాకలోని 70-80 శాతం నేల ఎప్పుడూ శుభ్రంగా పొడిగా ఉండే అవకాశముంటుంది. మేత, దాణా, వ్యర్థాలను సులువుగా ట్రాలీలతో తరలించేందుకు వీలుగా ఎక్కడా మెట్లు, ఇతర అడ్డంకులు లేకుండా చూడాలి. నేలను సులువుగా, వేగంగా, సమర్థవంతంగా శుభ్రపర్చుటకు తగిన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వీలైతే పవువుల పాకలను పశుగ్రాసాల సాగు భూమికి లేదా గడ్డివాములకు, హైడ్రోపోనిక్ గ్రాసాలు లేదా అజొల్లా సాగు ప్రదేశాలకు సమీపంలో ఏర్పాటు చేసుకోవాలి. పశుగ్రాస సాగుకు దగ్గరలో సొంత భూమి లేకపోతే పక్కనే ఉన్న ఇతరుల భూమినైనా కౌలుకు తీసుకుని ఏర్పాట్లు చేసుకోవాలి. పశువుల వ్యర్థాలు, పశుగ్రాసాల సాగు రవాణా వేగవంతం, సులభతరం కాగలవు. పశువుల పాకల సమీపంలో పశువులను సులువుగా నిర్బంధించి ఆరోగ్య పరీక్షలు, టీకాలు, మందులు పట్టించుటకు ఇనుముతో కాకపోయినా కర్రలతో అయినా బోనును నిర్మించుకుంటే ఇతరుల సహాయాన్ని కోరాల్సిన అవసరం తగ్గుతుంది.

ఆధునిక టెక్నాలజీతో రైతులు ముందుకు సాగాలి

నేడు ప్రతి ఒక్కరూ పాడి పరిశ్రమ వైపు మొగ్గు చూపుతున్నారు. నిరుద్యోగ యువత ఉపాధి పొందడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై రుణాలు అందజేస్తున్నది. ఆధునిక టెక్నాలజీతో అధిక శ్రమ తగ్గించే రకరకాల యంత్రాలతో ఈ పశువులను సాకేందుకు అనేక అవకాశాలున్నాయి. ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీతోపాటు శ్రమను తగ్గించే యంత్రాల ద్వారా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పశువుల పాకను సరైన రీతిలో నిర్మించుకుని ముందుకు సాగాలి.

- అంజిలప్ప, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

పాలు పిండే యంత్రాల వినియోగం

ఇప్పుడు పాడి నిర్వహణ చాలా వరకు వయస్సు మళ్లిన వారిపైనే ఉంది. అనారోగ్య, వృద్ధాప్య సమస్యల వల్ల వృద్ధులు, యువత కూడా పాలు పిండలేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పుడు పాడి రైతులకు ప్రభుత్వాలు సబ్సిడీపై పాలు పిండే యంత్రాలను కూడా అందిస్తున్నాయి. నాలుగైదు పశువులు కలిగిన ప్రతి రైతుకు ఈ పాలు పిండే యంత్రాలు ఎంతో ఉపయోగపడతాయి. ఇరుగు, పొరుగు రైతులు సమష్టిగా కూడా ఈ యంత్రాలను ఏర్పాటు చేసుకోవచ్చు. లేదా పాల సేకరణ చేసే సంచార పాల వ్యాపారులే తమ వాహనానికి అమర్చుకుని పాలు పిండే యంత్రంతో పశువుల వద్దకే వచ్చి పాలు పిండుకుని కొనుగోలు చేసుకునే ఏర్పాటును కూడా ప్రోత్సహించవచ్చును. విద్యుత్‌తోనే కాక ట్రాక్టర్ ఇంజిన్‌తో కూడా నడిచే పాల యంత్రాలు నేడు అందుబాటులో ఉన్నాయి. పాల సహకార సంఘాలు ఈ విషయంలో తమకు అనువైన విధానాలను గ్రామస్థాయిలో అమలు చేయవచ్చు. చేతులతో పిండే పాల కంటే యంత్రాలతో పిండిన పాలే ఎక్కువ శుభ్రంగా ఉండి ఎక్కువ సేపు నిల్వ ఉంటాయి. అవసరమైతే చేతులతో పాలు పిండటానికి కుటుంబసభ్యులందరూ సిద్ధంగా ఉండాలి.

యంత్రాల సహాయంతో పాలను పితుకుతున్న రైతులు

పరిశీలన పారదర్శకంగా జరగాలి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 10 : ప్రజాపాలనలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ ప్రభుత్వం అందించనున్న నేపథ్యంలో ప్రజాపాలన దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన పారదర్శకంగా నిర్వహించాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శనివారం మహాలక్ష్మి పథకం కింద ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలపై శనివారం కలెక్టర్ సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ ఏజెన్సీ పేరు, కన్స్యూమర్ నంబర్, రేషన్ కార్డ్ నంబర్ లాంటి వివరాలను ఆన్‌లైన్‌లో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్, వికారాబాద్, తాండూరు ఆర్డీవోలు విజయకుమారి, శ్రీనివాసరావు, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటకు జూనియర్ కళాశాల కేటాయింపు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

రూ.7.13 కోట్లు మంజూరు

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 10 : బొంరాస్‌పేట మండలానికి ప్రభుత్వం జూనియర్ కళాశాలను కేటాయించగా.. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి జూనియర్ కళాశాలను ప్రారంభించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కళాశాల నూతన భవన నిర్మాణానికి రూ.4.79 కోట్లు, ఇతర పనులకు రూ.2.34 కోట్లు మంజూరు చేసింది. దౌల్తాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం, ఇతర పనులకు రూ.7.13 కోట్లను సర్కారు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బొంరాస్‌పేటలో జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఇంటర్ విద్య అభ్యసించడానికి పరిగి, తాండూరు, వికారాబాద్‌లకు వెళ్లేవారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి బొంరాస్‌పేటకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయడంపై విద్యార్థులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

నైతిక విలువలతో కూడిన విద్యను బోధించాలి

విద్యార్థులకు విద్యపై అవగాహన కల్పిస్తున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి రజిని

మాదాపూర్, ఫిబ్రవరి 10 : విద్యతోనే మెరుగైన సమాజం నిర్మితమవుతుందని, విద్యను నైతిక విలువలతో కలిపి బోధించడం ఎంతో ముఖ్యమని హైకోర్టు మాజీ విశ్రాంత న్యాయమూర్తి రజిని తెలిపారు. మాదాపూర్ గోకుల్ ప్లాట్స్‌లోని డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీని నిర్వాహకురాలు అరుణతో కలిసి సందర్శించి విద్యార్థులకు విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేరాల నుంచి సమాజాన్ని విముక్తి చేయడానికి విద్య పాత్ర ఎంతో ఉందన్నారు. విద్య లేమి సమాజంలో నేరాలకు ప్రధాన కారణంగా ఉన్నట్లు చెప్పారు. కుటుంబాలు తమ ఉపాధి కోసం వివిధ ప్రదేశాలకు వలస వచ్చిన విద్యార్థులకు విద్య విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైన ఉందన్నారు. మహిళలు రాత్రి సమయంలో కూడా స్వేచ్ఛగా తిరిగే సమాజాన్ని సాధించడానికి అడుగులు వేయాలన్నారు. మహిళలు ఒంటరిగా భద్రంగా ఉండగలిగే నిజమైన స్వాతంత్ర్యాన్ని సాధించినప్పుడే మహాత్మాగాంధీ స్వప్నం నిజమైనట్లని ఆమె తెలిపారు.

కార్మికుడి హత్య

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 10 : పని చేస్తున్న పరిశ్రమలోనే సెక్యూరిటీ గార్డ్స్ కార్మికుడిని కత్తితో గొంతుకోసి హతమార్చారు. ఈ సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గగన్‌పహాడ్ పారిశ్రామికవాడలో జరిగింది. సీఐ బాలరాజు కథనం ప్రకారం.. నేపాల్‌కు చెందిన విజయ్‌బహదూర్(50) కుటుంబ సభ్యులతో కలిసి గగన్‌పహాడ్‌లో నివాసముంటూ స్థానికంగా ఉన్న లియో లామినేట్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి సెక్యూరిటీ గార్డ్ నిత్యానంద్‌కు విజయ్‌బహదూర్‌కు మధ్య స్వల్ప గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన నిత్యానంద్ మరో సెక్యూరిటీ గార్డుతో కలిసి విజయ్‌బహదూర్‌పై దాడికి దిగారు. అంతటితో ఆగకుండా కత్తితో గొంతు కోసి హతమార్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.